

# మా వాడి లవ్ ఎఫైర్స్

భానుమతీ రామకృష్ణ

మా వాడు—అంటే మా మేనత్త కొడుకు లేండి—వాణ్ని నేను 'బావా' అని పిలవాలని వాడి పట్టు. చిన్నప్పటినుండి కూడా చస్తే వాణ్ని 'బావా' అనేదాన్ని కాను. పేరు పెట్టి పిలిచేదాన్ని. వాడికి నన్ను చూస్తే కోపం. మా ఇద్దరికీ మధ్య పచ్చిగడ్డి భగ్గుమనేది. వాడి నీడ నాకు సరిపడదు. నా నీడ వాడికి సరిపడదు. మా యిద్దరికీ అస్తమానం ఏదో ఒక కీచులాట. వాడు పచ్చి దొంగ. వాడి చేష్టలు చిన్నప్పటి నుండి నాకు నచ్చేవికావు.

మా నాయనమ్మ బ్రతికుండగా వీణ్ణి చాలా ముద్దు చేసేది. వీడికి చాలా దురలవాట్లు చేసింది. చద్దెన్నం పెట్టి వూళ్లోకి ఆటలకి పంపేది. బడికిపోతే కుర్రాడు చెడిపోతాడని ఆవిడ అభిప్రాయం కాబోలు. వాడికి పన్నెండు ఏళ్ళు వచ్చిందాకా యింకా నాలుగో క్లాసే చదువుతున్నాడు. ప్రొద్దుటే చద్దెన్నం ముక్కు-వరకు తిని పలక, పుస్తకాలు అవతల పారేసి మా నాయనమ్మ వంటింట్లో వుండే అక్కడకు పోయి వెధవ దొంగవేషం వేసి వచ్చిరాని బాధ అభినయిస్తూ "అమ్మమ్మా కడుపులో ఏదోలాగుందే" అని నసిగేవాడు.

ఆవిడ మడికట్టుకున్నదల్లా అమాంతం మైలపడి "మా నాయన బడికెళ్ళకే-మా తండ్రి బడి కెళ్లకే" అని వాడికి పక్కేసి పడుకోబెట్టేది.

ఈ విధంగా వాడు ఒక్కొక్క క్లాసు 2-3 ఏళ్ళ వంతున స్టడీ చేశాడు. ఇరవై ఏళ్ళు వచ్చాక ఫిఫ్తుఫారంలో వచ్చి పడ్డాడు. నాకప్పటికి పన్నెండు ఏళ్ళు. థర్డుఫారం చదువుతున్నా. మా యిద్దరికీ పెళ్ళి అవుతుందని ఎవరికి నమ్మకం లేకపోయినా మామేనత్తకు ఈవిషయంలో ఘట్టి నమ్మకం వుండి. అంచేత రోజూ మా నాన్న భోజనం టైమ్‌లో మంధర లాగా నూరిపోస్తూ వుండేది. "వెంటనే పెళ్ళి చేసేయాలి. ఆడపిల్లలు చదివితే చెడిపోతారు. పిల్ల పెద్ద కాకముందే పెళ్ళి చేస్తే వూరేగింపులు, వుత్సవాలు, బంతులాటలు వసంతాలు వగైరా చేయొచ్చు" అని ఏకరువు పెడుతూండేది. ఆవిడ ధోరణి మొదలెడితే అది అటో ఇటో తేలాల్సిందే-ఆవిడగారి భర్తను తన 18 వ ఏటనే,అంటే మావాడు పుట్టగానే, స్వర్గానికి పంపింది. బహుశా ఆయన ఈ పోరు భరించలేకనే శలవు తీసుకొని వుంటాడు. ఆవిడగారి మనసు నొప్పిస్తే ఇంటికి శుభంకాదని మా నాన్నకు భయం. మా అత్తకు కళ్లనీళ్ళు కార్చడంలో మంచి నేర్పువుంది.అప్పుడప్పుడు మా అమ్మకూ ఆవిడకూ జగడం వస్తే, మా నాన్న అమ్మనే చీవాట్లు వేస్తాడు. ఆవిణ్ణి ఏమీ అనడు అంటే భోరున ఏడుస్తుంది. ఆ కంటినీరు నట్టింటపడితే సిరివుండదని ఆయన నమ్మకం—కానీ, భర్త పోయాక ఆవిడ మా యింట్లో కాలుపెడుతూనే-మాకు తప్పకుండా వ్యాజ్యంలో వస్తుందనుకున్న 50 వేల రూపాయిల ఆస్తి పోయింది ఆసంగతి ఆయన గమనించలా మా అమ్మ ఈ సంగతి జ్ఞాపకం చేసుకుని చాటుగా మెటికలు విరుస్తుంది మా అత్తను. ఇరవై ఏళ్ళలోగా మా యింట్లో మా అత్త చాలా పెద్ద అధికారం సంపాదించింది.

మా నాయనమ్మ చచ్చిపోతూ నన్ను మావాడికే యిచ్చి పెళ్ళి చేయమని చెప్పి పోయింది. మా అమ్మకు సుతరామూ ఇష్టంలేదు ఈ పెళ్ళి-అందుకే కాబోలు మానాయనమ్మ తద్దినం వచ్చినప్పుడంతా వంటకాల్లో వుప్పు జాస్తి వేస్తుందేమో మా వాడి పొడ కూడా మా అమ్మకు కిట్టదు. నన్ను వాడితో అసలు మాట్లాడనిచ్చేది కాదు. వాడు తిరిగే చోట్లు, చేసే వ్యవహారాలు నాకూ అమ్మకూ యిద్దరికీ నచ్చేవికావు. వాడికి వున్న సంగీతం పిచ్చి ఎవరికీ ఏ పాతకులకూ వుండదు. ఏ డ్రామావాళ్లు వచ్చినా వాళ్ళకు అడ్డమైన చాకిరీ చేసి, మొఖానికి రంగు వేసుకోవాలని చాలా ప్రయత్నం చేసేవాడు కాని,ఎవరూ 'బృహన్నల' డ్రామా లేయకపోవడంవల్ల మావాడికి హీరో ఛాన్సు లేకపోయింది వేషం లేకపోయినా వాళ్ళ దగ్గరనుండి ఆయా డ్రామాల పద్యాలు కొన్ని కంఠస్తం పెట్టాడు. వాటిని చదివి వీడొక్క పాతకుడనిపించుకొని వీడికంటె వెధవల్ని శిష్యుల్ని చేసు


కున్నాడు. ఒక మంగలి శిష్యుడు, ఒక కంసాలిమరొకడు ఇంకోడు కాఫీహోటలు యజమాని-వీడికొచ్చిన-నాలుగుపద్యాలు వాళ్ళకి నేర్పుతుండేవాడు-రెండవది ప్రేమను గురించి, అప్పుడప్పుడు వుపన్యాసాలు యిస్తుండేవాడు ఆ నలుగురి మధ్యలో.

వాడి థియరీప్రకారం ప్రేమించ గలుగుతే పెళ్ళయిన పిల్లనయినా ప్రేమించవచ్చు. ఏభయి ఏళ్ళ వృద్ధురాల్నయినా ప్రేమించవచ్చు-అని.

ఒకసారి మా అమ్మ స్నేహితురాలు మా యింటికొస్తే వీడు చూచి ఆవిడను, ఆవిడ శరీరాన్ని వర్ణిస్తూ ఏదో పద్యం చదివాడట-ఆఖర్న ఆవిడ పేరుతో కూడా పద్యంలో జోడించి! ఆడ వాళ్ళను చూస్తే అప్పటికప్పుడు కవిత్వం పొర్లివస్తుంది వాడికి. నడిబజార్లో ఆడది కనిపించినా సరే చెంపమీద చేయి పెట్టి శంకరాభరణంతో,పద్యంఎత్తుకుంటాడు, వర్ణించుతూ అప్పటికి వీడికేదో వున్మాదం అని కొందరూ-ఏదో కుర్రతనం అని కొందరూ దేహశుద్ధి చేయకుండా వదిలారు.

వీడి కుర్రతనం మండ! కనిపించిన ఏ ఆడదాన్ని అయినాసరే ఒంటరిపాటున కనిపిస్తే వీడూ వీడి పద్యం తయారు! ఏ ఆడది వూరుకుంటుంది? ఒకసారి గరల్స్ స్కూలునుంచి ఎవరో పిల్ల వస్తుంటే-దానిమీద పద్యం చదివాడట. ఆ పిల్ల దార్లో వుండే పేడ కళ్లు కొన్ని తీసి మా వాడిమీద వేసింది. బట్టలంతా ఖరాబు అంతటితో వదిలింది. కాని, మర్నాడు-మా యింటికి వచ్చింది, ఆ కంప్లెయింట్-. రోజూ ఏదో వొక వుపద్రవం కొంప మీదకు తీసుకురావడం మావాడి దినచర్య అయిపోయింది. కాని దేహశుద్ధి కాకుండా తప్పించుకు వస్తున్నాడు. వీడు చీవాట్లు తినని స్థలం అంటూ వూర్లో మిగల్లేదు. చెరువుకట్టా ఆ ప్రాంతాలూ, గరల్స్ స్కూల్స్ అయిపోయాయి.

ఇంక దేవాలయాల్లో వీడి దృష్టి అప్పుడే ఆకర్షించింది,శివాలయం పూజారి గారిల్లు-అప్పుడే పెళ్ళయి అత్తారింటికి పోవడానికి రెడీగా వుంది ఆ పిల్ల. ఆ పిల్ల అన్న మావాడి క్లాస్‌మేంట్. ఇంకేం రొట్టె విరిగి నేతిలో పడ్డదన్నమాటే! మావాడు ఆ కుర్రాడికి సంగీతం (తన కొచ్చిన నాలుగు పద్యాల్లో) ఒక పద్యం చెప్పడం మొదలెట్టి వుంటాడు. రోజూ సాయంకాలానికి పూలరంగడిలా ముస్తాబయి బయల్దేరేవాడు శివాలయానికి. వాళ్ల ఇంట్లో వీడికి చాలా చనువు ఏర్పడింది. ఆ అమ్మాయి కూడా చనువుగా మాట్లాడు తుండేది. ఇంకేం, వీడు పద్యాలన్నీ చది వాడన్నమాటే! వాళ్ళకు కూడా సంగీతం పిచ్చి వుండటంట్టి వీడేం పద్యాలు చదివినా సంగీతమే అనుకున్నారు. పైగా వాళ్లన్న ఒకడు వీడికి అడ్డు. అందువల్ల ఆ పిల్లను ఒంటరిపాటున కల్సుకోడానికిప్రయత్నం



చేసేవాడు. ఇంటిపనుల్లో ఆ పిల్ల వుండిపోయేది. మా వాడు స్త్రీ స్వాతంత్ర్యం, స్త్రీ అబల కాదు సబల కావాలని ఆ పిల్లకు బోధపరుస్తుండేవాడు. పైగా ఆ పిల్ల మొగుడికి ఇంగ్లీషు రాకపోవడంవల్ల మా వాడు—పెద్ద 'గ్రాడ్యుయేట్' లాగా ఆ అమ్మాయి దగ్గర 'పోజ్' చేసేవాడు. పైగా వాడికొక గర్వం. వీడు వెధవ మన్మధుడనిన్నీ, వీణ్ణి చూసి ఆడది అమాంతం మూర్ఛపోతుందనిన్నీ. అంచేత ఆ పిల్ల వీణ్ణి ప్రేమించినట్లుగానే భావించుకొనేవాడు. ఒకరోజు ఆ పిల్ల భర్త వచ్చాడు. ఆ సంగతి వీడికి తెలీదు. ఆ అమ్మాయి తన భర్త దగ్గిర మాట్లాడుతూ కూర్చుంది. సాధారణంగా కొత్త పెళ్ళికూతురు కాబట్టి కాస్త మొగుణ్ని చూసి బిడియపడుతూ మాట్లాడుతూ నుంచుంది. మావాడు వెళ్ళి ఆ సీను చూశాడు. ఆపిల్ల ఎవరితోనో పరాయివాడితో మాట్లాడుతోంది.... తన ప్రేమను తోసేసిందనుకుని వీడికి కోపం వచ్చింది.

తర్వాత—ఆ పిల్ల అన్నతో చెప్పాడు: "ఏంరా, మీసిస్టరు రౌడీ కుర్రాళ్ళతో మాట్లాడుతోంది. చెడిపోతుంది. ఇందాక ఎవరితోనో మాట్లాడుతోంది...గిరజాల మనిషి !"

ఆ కుర్రాడు తెల్లబోయి—ఆ గిరజాల మనిషి తనచెల్లెలు మొగుడేనని చెప్పాడు. దాంతో వీడు తల తిరిగి కిందపడబోయి, ఆ పూటకు కొంప చేరుకున్నాడు. ఆ మర్నాడు కూడా ఆ పిల్ల మొగుడు

యింట్లో వుండటంవల్ల శివాలయంలో ఆవరణలో కూర్చుని విరహబాధ నభిన యిస్తూ శాకుంతల తాలూకు, సావిత్రిలో కొన్ని పద్యాలు మొదలెట్టాడు-శంకరా భరణంలో. సాయంకాలం ఒక్కొక్కసారి ఆ అమ్మాయి గుళ్ళో దీపం వెలిగించడానికి వస్తుంటుంది. ఆ గుడికి ఏడాది కొకరు కూడా రారు. అందువల్ల పూజారీ దానికి తగినట్లే చేస్తుంటాడు సమయానికి ఆ పిల్ల ఒంటరిగా రావడం జరిగేసరికి మావాడు పరమానందభరితుడై చాలా కాలంగా తీరని తన కోర్కె ఈ రోజు తీరిందని పొంగిపోయాడు. ఆ అమ్మాయి నడిచి వస్తుంటే వీడు పద్యం మొదలెట్టాడు.

"చెలికేలం తన కేలు పూని..వెనుకనే జీరాడు పయ్యెటతో..." అంటూ.


ఆ అమ్మాయికి చెలిలేదు. కేలూలేదు. వీడికి వచ్చిన పద్యాల్లో అదొకటి-ఆ అమ్మాయి ఒక్కొక్క మెట్టు ఎక్కి వస్తుంటే-ఇంకో పద్యం ఎత్తుకున్నాడు.

"పాచిపట్టిన మట్టి పాషాణతలమది-అడుగులు మెల్లి మెల్లిగా నిడవలయూ(-ఊ ఊ ఊ ఊ ఊ..." అని చెవులు అదిరిపోయేట్టు సంగీతం తిప్పుతున్నాడు.

ఆ అమ్మాయి మామూలుగానే వాడితో మాట్లాడింది. వాడంత పొద్దప్పుడు అక్కడ వుండడం అదే మొదటిసారి. మావాడు చివరికి వుండబట్టలేక ఆ అమ్మాయి దారికి అడ్డం నిల్చుని "ప్రేయసీ, నీ కోసం ఎన్ని రోజులిల్లా తపించమనెదవు ? హృదయేశ్వరీ ! నీ భర్తను చూచితిని-నీవెంతమాత్రము అతనికి తగిన భార్యవు కాజాలవు-ముమ్మాటికి కాజాలవు ! నీవిలా కృశిస్తే నేను చూడలేను. నాకు తెలుసు నీ భర్త మీద నీకిష్టం లేదని, నన్ను ప్రేమించావని. కాని...నేను ఇన్నాళ్లూ ఆలశ్యం చేశాను నీ ప్రేమ గుర్తించకుండా-ఇప్పటికీ,మించిపోయింది లేదు... నీవు నీ భర్తను వొదిలి..."

టాప్-టాప్ మని ఆ చెంప ఈ చెంప వాయించి ఆ అమ్మాయి దేవుడికి దీపం వెలిగించకుండానే చరచర యింటికి పోయింది. మావాడు పక్క పళ్లు సర్దుకుంటూ యింకా అక్కడే వుంటే వాళ్ళు వాళ్ళు తప్పకుండా దేహశుద్ధి చేస్తారని కాలికి బుద్ధి చెప్పాడు. మర్నాడు ఆ పిల్ల తండ్రి మా యింటికి వచ్చాడు, ఇద్దరు పెద్దమనుష్యుల్ని పక్కన వేసుకుని. మళ్ళీ మావాడు ఆ ప్రాంతాల్లో కనిపిస్తే వీపు చెడుతుందనీ, సున్నంలోకి ఎముక లేకుండా తంతామనీ చెప్పి మరీ వెళ్ళారు.

ఇంతకుముందు మావాడి విషయాలు మా నాన్నకి పూర్తిగా తెలియవు. ఈసారి పూర్తిగా తెలిసింది.తల వాచేట్టు మావాణ్ని చీవాట్లు వేశాడు. మధ్యలోనే మా అత్త అడ్డొచ్చి—"అందరూ చిన్నప్పుడు యింతే. వీడి నెత్తినే పొద్దు




పొడవలా-అయినా వాళ్ళ పిల్లను వాళ్ళు జాగ్రత్త చేసుకోకూడదూ ?" అని మూతి విరిచి కొడుకును సమర్థించింది. మా అత్త అంటే మా నాన్నకి సింహస్వప్నం. కిమన్నాస్తి తిరిగి మాట్లాడలా ఆ విషయం గురించి.

మా వాడికి ఈ చీవాట్లొక లెక్క కాదు. తను చిన్నవాటిలో ఈసారి రామాలయపూజారి నంబివారి ఇంటి పక్కకి సైకిలుమీద చాలాసార్లు వెళ్ళి వస్తున్నాడు. ఆ పూజారికి ఒక మూడవ భార్య. ఆమెకు వయసులోనే వుండే ఒక కూతురు. వీళ్ళిద్దర్లో ఎవరు మావాడిని ఆకర్షించారో తెలీదు ఇద్దరూ బొగ్గుల్లో రామచిలుకలు. అయినా, మావాడి థియరీ ప్రకారం, ప్రేమించడం చేత నయితే దేనికయినా 'అడ్జస్టు' కావచ్చని. శివాలయంలో జరిగిన కాండ అప్పుడే ఆ నోటా ఆ నోటా వూరంతా పొక్కింది. అమ్మలక్కలు మా అమ్మను బుగ్గ పొడవడం మొదలుపెట్టారు. అసలే, మావాడంటే ఆమెకికోపం...ఇదివిన్నాక ఇంకా అసహ్యం బయలుదేరింది. మా అత్త ఏం చెప్పిందో ఏమో, ఒకరోజు మా నాన్న, అత్తా ఇద్దరూ ఒకటై నా పెళ్ళి విషయం గురించి ప్రస్తావన తెచ్చారు...."తక్షణమే-మా వాడికిచ్చి నన్ను పెళ్ళి చేసేస్తే-ఇకమీద వాడు ఇల్లాంటి అల్లరి పడడు. ఇంట్లో వుండే సంబంధమే కాబట్టి చప్పున తేల్చాలి!" అని మా అత్త వుపోద్ఘాతం.

మా అమ్మ ససేమిరా వాడికినన్నివ్వ నంది మా అత్త పెద్దపెట్టున ఏడుస్తూ "ఇవ్వకపోతే బావిలో పడతా" నంది. "ఇస్తే చెర్లో పడతా" నంది అమ్మ. అత్త పడ్డ బావిలో అమ్మకు ఎటూ చోటుండదు.

"మీ యిద్దరూ ఎల్లాగో ఒకలా

ఛావండి ! నేను మా అన్నదగ్గరికిపోయి చస్తా"నని నాన్న ఒక్క విసురున ఆఫీసుకి వెళ్ళాడు. ఉన్నట్టుండి విషయం, ఇంక విషమరూపం ధరించడం, ఆ పూట పొయ్యిలో పిల్లి లేవకపోవడం వగైరా అనుకోకుండా జరిగాయి. బావిలో మా అత్త ఎక్కడ దూకుతుందో అని నేను బావిగట్టు దగ్గర కాపలా కూర్చున్నా. కాని ఆవిడ ఇంట్లో వంట వేరేగా తయారుచేసుకుంటూంది.

మా పక్కింటావిడ రోజూ తన పిల్లల్ని ఇరవైసార్లన్నా గుంటలు తవ్వి వాళ్ళని పాతేసి, మళ్ళీ పైకి తీస్తూ వుంటుందితిట్లల్లో. కాని వాళ్ళని గుంటల్లో పాతేసిందానికంటె ఎక్కువగా బాధపెడుతుంది ఆవిడ పెద్దకూతురు నా ఫ్రెండు. అది పరుగెత్తుకుంటూ వచ్చి బావి గట్టున వుండే నన్ను చూచి, ఆశ్చర్యంగా "ఏమే, బావిలో పడతా వేందే ?" అంది.

"నేను కాదు మా అత్త" అని ఆమె వైపు చూశాను. మూతి విరిచింది. "సరేగానీ, నీతో ఒక మాట, అర్జెంట్!" అని పిల్చింది.

ఏమిటోగదా, అని వెళ్ళాను. అది రొప్పుతూ, "మీ బావను చావగొట్టారు రామాలయంలో! అంతా దెబ్బలు. రక్తం. అక్కడ ఎవరో వెంటనే హాస్పిటలుకు తీసుకెళ్ళారు," అంది.

నా కాళ్ళు వణికాయి. వెంటనే నాన్న ఆఫీసుకు పరుగెత్తి సంగతి చెప్పాను. హాస్పిటలుకు వెళ్ళాం. బెడ్‌మీద స్పృహ తప్పి పడివున్నాడు...కోలుకునేసరికి పదిరోజులు పట్టింది. తర్వాత తెలిసింది...

వీడు రామాలయంలో వుండే రామ చిలుకల కోసం ఆ వీధినే ఇరవైసార్లు తిరగడంతో ఇంతకు ముందు వాళ్ళ మీద కన్ను వేసిన మరికొందరు గోరువంకలు వీణ్ణి చావగొట్టారు. ఇది జరిగిన నెల రోజులకి ఆ పిల్లలు అత్తారిళ్ళకి వెళ్ళి పోయారు. కాని, మావాడి ఒంటిమీద గాయాలు మానడానికి మరో నెల పట్టింది. ఆ తర్వాత మళ్ళీ నా పెళ్ళి ప్రస్తావన రాలేదు. మావాడు ఆలయాలపక్కకి పోనూలేదు. కాని, మళ్ళీ ఈ మధ్య 'విడోమేరెజెస్'ను గురించి తీవ్రంగా పనిచేస్తున్నాడని తెలిసింది. వాడికి ఆ బుద్ధి వంటచెరుకుతోనే పోయేది !

